
సాక్షి
జనగామ

శనివారం | 10 | మే | 2025



పుష్కరాలకు వైద్యసేవలు

కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ఈ నెల 15 నుంచి నిర్వహించే సరస్వతి పుష్కరాల్లో భక్తులకు వైద్యసేవలు అందించేందుకు ఆ శాఖ ఏర్పాట్లు చేసింది. - 10లో▸



మానసిక వికాసానికి క్రీడలు దోహదం

- 10లో▸

వ్యక్తిగత వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39^0 /25^0

ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత మరింత పెరుగుతుంది.

వెదురుతో తయారు చేసిన ఎడ్లబండి



పక్షులు



తాబేలు



నెమలిపింఛం





అందాలతారలను ఆకర్షించేలా..

అటవీశాఖ తరఫున అందమైన వెదురు బొమ్మలు


- 20 రోజులపాటు మేదరులకు ప్రత్యేక శిక్షణ
- ఇప్పటికే పూర్తికావొచ్చిన తయారీ
- రామప్పలో స్టాల్ ఏర్పాటుకు ప్రణాళిక

ములుగు: ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ సందర్శనకు ఈ నెల 14వ తేదీన రానున్న 35 మంది అందాల తారలను ఆకర్షించేలా జిల్లా అటవీశాఖ తరఫున ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ మేరకు జంగాలపల్లి గ్రామంలోని 30 మంది మేదరులకు మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ఇద్దరు శిక్షకుల సమక్షంలో వెదురు బొమ్మల తయారీపై ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఇప్పటి వరకు వారు చేసిన వెదురుబొంగు గ్లాసులు, డేగ, ఎడ్ల బండిపై రైతు దంపతులు, చిలుకలు, విసన కర్ర, తాబేలు, పిచ్చుకలు, పింఛం వదిలిన నెమలి వంటి బొమ్మలు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ బొమ్మలను అందాల తారలకు జ్ఞాపికలుగా అందించాలా.. స్టాల్ ఏర్పాటు చేసి వచ్చే వారంతా చూసేలా చూడాలా అనే విషయంపై పూర్తి నిర్ణయం తీసుకోలేదు. ఆ బొమ్మలకు సుందరీమణులు ఆకర్షితులైతే వీటికి ఉచిత ప్రచారం జరగడంతో పాటు జిల్లాకు ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ వస్తుందని అటవీ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ములుగు జిల్లాకు రెండుసార్లు వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అటవీ శాఖ ఈ బొమ్మలను అందించగా ఆయన మంత్రముగ్ధుడయ్యారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క.. అధికారులను అభినందించారు. ఈ కోణంలో రామప్పకు వచ్చే సుందరీమణులను ఈ బొమ్మలు ఆకర్షిస్తాయని భావిస్తున్నారు.

బొమ్మలు తయారు చేస్తున్న మహిళలు



టీ, నీళ్లు తాగే గ్లాసులు



మనకంటూ ఓ బ్రాండ్ వచ్చేలా..



నిర్మల్, పోచంపల్లి వంటి ప్రాంతాలకు వచ్చిన ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని ములుగు జిల్లాకు ప్రత్యేక బ్రాండ్ తీసుకొచ్చేలా వెదురు బొంగులతో ప్రత్యేక అందాన్ని ఇచ్చే విధంగా బొమ్మలను తయారు చేయిస్తున్నాం. రామప్ప దేవాలయ సందర్శనకు వచ్చే అందాల తారలకు బహుమతులుగా ఇవ్వాలా.. స్టాల్ ఏర్పాటు చేసి విక్రయించాలా అనేది ఆలోచిస్తున్నాం. ఇప్పటికే 30 మంది మహిళలకు 20 రోజులపాటు శిక్షణ ఇచ్చాం. వారు తయారుచేసిన బొమ్మలు చూడముచ్చటగా, సహజసిద్ధంగా ఉన్నాయి. కచ్చితంగా అందరినీ ఆకర్షిస్తాయని భావిస్తున్నాం.

- రాహుల్ కిషన్ జాదవ్, డీఎఫ్‌ఓ, ములుగు

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



జనగామ రూరల్: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండీ.షరీఫ్, ఇప్ప రాంరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ భోజన్నకు విజ్ఞప్తి చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈఓను సంఘం జిల్లా కమిటీ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిసి డీటీఎఫ్ డైరీ, జీఓల పుస్తకం అందజేశారు. ఈ కార్యక్రమంలో చొక్కయ్య, శ్రీనివాస్, యాదయ్య, శివరాం, దివాకర్‌రెడ్డి, జగ్గారెడ్డి, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

గోవులను రక్షించాలి



జనగామ: గోరక్షణ చట్టాలను అమలు చేసి గోవుల రక్షణకు పోలీస్ యంత్రాంగం కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి డాక్టర్ మోహనకృష్ణ భార్గవ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఏసీపీ పండేరే చేతన్ నితిన్‌కు వివిధ అంశాలతో కూడిన వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గోవధశాలలను మూసివేసి, గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు.

టీచర్ల శిక్షణకు డీఆర్పీలు సిద్ధంగా ఉండాలి



విద్యారణ్యపురి: త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఉపాధ్యాయుల శిక్షణకు డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్ (డీఆర్పీ)లు సిద్ధంగా ఉండాలని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి కోరారు. ఐదురోజులుగా హనుమకొండ జిల్లా కాజీపేటలోని బాలవికాస్‌లో రాష్ట్రస్థాయిలో గణితం, సోషల్ స్టడీస్ జిల్లా రిసోర్స్‌పర్సన్లకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. సమావేశంలో ఎస్‌సీఈఆర్టీ కోర్సు కో–ఆర్డినేటర్లు ఎల్లయ్య, గణపతి, రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు రథంగాపాణిరెడ్డి పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన హనుమకొండ జిల్లా జడ్జి



వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని హనుమకొండ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పట్టాభి రామారావు, ములుగు సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్య లాల్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ పూజారులు తీర్థప్రసాదా లు, ఆశీర్వచనం అందజేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేశ్ వివరించగా.. రామప్ప శిల్పకళాసంపద బాగుందని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సై జక్కుల సతీశ్ తదితరులు ఉన్నారు.

వానాకాలం పంటల ప్రణాళిక ఖరారు

3.49 లక్షల ఎకరాల్లో సాగు అంచనా..

- ఈ ఏడాది అత్యధికంగా వరి, పత్తికి అవకాశం
- అందుబాటులో 25 శాతం విత్తనాలు, ఎరువులు
- సీజన్ నాటికి అందించేలా అధికార యంత్రాంగం కసరత్తు
- దుక్కులు సిద్ధం చేసుకుంటున్న అన్నదాతలు



రఘునాథపల్లిలో దుక్కి దున్నుతున్న రైతు(ఫైల్)

జనగామ రూరల్: జిల్లాలో యాసంగి పంటలు ముగుస్తున్న క్రమంలో రైతులు వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. యాసంగి సీజన్ చివరలో జిల్లాకు దేవాదుల ద్వారా నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోయి చాలామంది రైతులకు నష్టం వాటిల్లింది. పెట్టిన పెట్టుబడులు సైతం రాక ఇబ్బందులు పడ్డారు. ఈ వానాకాలంలోనైనా మంచి దిగుబడి వస్తుందనే ఆశతో ముందుకుసాగుతున్నారు. ఇందుకు అనుగుణంగా జిల్లా వ్యవసాయ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. వానాకాలంలో సుమారు 3,49,930 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తారని అంచనా వేస్తున్నారు. అయితే గత సీజన్‌తో పోలిస్తే ఈసారి 40 నుంచి 50 వేల ఎకరాల్లో అదనంగా సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అలాగే పండ్ల తోటలు, ఇతర పంటల సాగుకు సంబంధించి ప్రణాళికను సైతం రూపొందించారు. ఈసారి వర్షాలు సైతం ముందుగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పడంతో కొంత మంది రైతులు వేసవి దుక్కులు మొదలుపెట్టారు.

సీజన్ ప్రారంభం నాటికి ఎరువులు

రైతులు సాగు చేసే పంటలకు అనుగుణంగా ఎన్ని మెట్రిక్ టన్నుల ఎరువులు, విత్తనాలు అవసరమవుతాయో అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాకు సంబంధించి వివిధ రకాల ఎరువులు 95,691 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేశారు. యూరియా 26వేలు అవసరం ఉండగా ప్రస్తుతం 4 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. డీఏపీ 5వేల మెట్రిక్ టన్నులకు 790 మెట్రిక్ టన్నులు, పోటాష్ 3,529 మెట్రిక్ టన్నులకు 450, ఎస్ఎస్‌పీ 1,783 మెట్రిక్ టన్నులకు 590, కాంప్లెక్స్ ఎరువులు 10 వేల మెట్రిక్ టన్నులకు 2వేల మెట్రిక్ టన్నులతోపాటు ఎరువలు అందుబాటులో ఉన్నాయి. అయితే సీజన్ ప్రారంభం వరకు నెలవారీ కోటా వస్తుందని, ఆ మేరకు రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచనున్నారు.

విత్తనాల అంచనా..

ఈసారి జిల్లాలో ఎక్కువగా వరి, పత్తి సాగవుతుండగా ఇందుకు అనుగుణంగా ముందుగానే అధికారులు అవసరమయ్యే విత్తనాల అంచనాలు సిద్ధం చేశారు. పత్తి 5లక్షల ప్యాకెట్‌లు, వరి 44,012 క్వింటాళ్లు, రెడ్ గ్రాం 70 క్వింటాళ్లు, పల్లికాయ 50 క్వింటాళ్లు, మొక్కజొన్న 367వేల క్వింటాళ్లు, మినుములు 1.5 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని భావిస్తున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్నారు. నకిలీ విత్తనాలతో పాటు విత్తనాలు, ఎరువుల విక్రయాలపై ఆన్‌లైన్ పద్ధతి, రశీదుల జారీపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

జిల్లాలో పంటల సాగు అంచనా (ఎకరాల్లో..)

వరి	2,15,000
పత్తి	1,25,000
మొక్కజొన్న	3,670
కందులు	3,500
కూరగాయలు	1,010
జొన్నలు	7.00
వేరుశనగ	100
పండ్లు	400
పొగాకు	500



రైతులకు ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉంచుతాం..



వానాకాలం సాగుకు సంబంధించి ఇప్పటికే ప్రణాళిక రూపొందించాం. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఎరువులకు సంబంధించి ప్రస్తుతం అందుబాటులో ఉన్నవే కాకుండా సీజన్ ప్రారంభం వరకు నెలవారీ కోటా తెప్పించి అందుబాటులో ఉంచుతాం. జిల్లాలో ఈసారి 3లక్షల 49 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అంచనా వేశాం.

- రామారావు నాయక్, జిల్లా వ్యవసాయాధికారి

సాక్షి ఎడిటర్ ఇంటిపై దాడి హేయమైన చర్య



జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

జనగామ: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై ఏపీ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దాడి చేయడం హేయమైన చర్య అని, దీనిని వ్యతిరేకిస్తూ జనగామ జర్నలిస్టులు నిరసన తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జనగామ జర్నలిస్టు సంఘాల ఆధర్యాన చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ.. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించేలా ఏపీ పోలీసులు వ్యవహరించడం సరికాదన్నారు. ఏపీ సర్కారు తీరు మార్చుకోకపోతే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వాస్తవాలను వెలికి తీసి పత్రికల్లో రాస్తే కక్షగట్టి అక్రమ కేసులు పెట్టి వేధించటం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఇర్రి మల్లారెడ్డి, సురిగల భిక్షపతి, శ్రీభాష్యం శేషాద్రి, హింగే మాధవరావు, భాస్కర్, బిట్ల మధు, బండి శ్రీనివాస్, ఉల్లెంగుల మనీ, కన్నారపు శివశంకర్, శశిధర్, నేతి ఉపేందర్, మహిపాల్‌రెడ్డి, గోవర్ధనం వేణుగోపాల్, కేమిడి ఉపేందర్, చొదరిపల్లి ఉపేందర్, యూసఫ్, పన్నీరు భానుచందర్, ఆశిష్, ఉపేందర్, మణికుమార్, బజాజ్, క్రాంతి, హరీష్, వినయ్, సాగర్, కిరణ్, నవీన్, ఓంకార్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్'కు సంపూర్ణ మద్దతు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు




మహాసభలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

జనగామ రూరల్: ఉగ్రవాదం నుంచి దేశానికి శాశ్వతంగా విముక్తి జరగాలి.. అలాగే ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను స్వాగతిస్తూ సంపూర్ణ మద్దతను తెలియజేస్తున్నామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ జనగామ పట్టణ 4వ మహాసభల్లో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదానికి కులం, మతం, దేశం అనే బేధం లేదని, పాకిస్థాన్ పాలకులు, ఉగ్రవాదులు ఒకరిపై ఒకరు ఆధారపడి భారత్‌లో నరమేధాన్ని సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌ను ఆసరాగా చేసుకుని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని, దానికి సరైన గుణపాఠం చెప్పాలిందేనన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. అలాగే ఈదేశ పౌరులైన మావోయిస్టులను ఏరివేసేందుకు ఆపరేషన్ కగార్ చేపట్టడం సరైంది కాదని, తక్షణమే దీనిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకునేదిలేదని కేంద్ర మంత్రి నియంతలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి, పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, నాయకులు చొప్పరి సోమయ్య, మోతె శ్రీశైలం, చామకుర యాకూబ్, కెమిడి మల్లయ్య, గుగులోత్ సఖి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- 1,416 మంది విద్యార్థులు
- మూడు పరీక్ష కేంద్రాలు
- అమలులో నిమిషం నిబంధన



జనగామ రూరల్: జిల్లాలో ఈనెల 13న నిర్వహించే పాలీసెట్–2025 అవసరమైన ఏర్పాట్లు చేశామని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.నర్సయ్య తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించే ఈ పరీక్షకు మొత్తం 1,416 మంది విద్యార్థులు హాజరుకానుండగా.. జిల్లాలో మొత్తం మూడు సెంటర్లు కేటాయించినట్లు చెప్పారు. పట్టణంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 576 మంది, సెయింట్ మేరీ హైస్కూల్‌లో 480 మంది, స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో 360 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. నిమిషం నిబంధన అమలులో ఉన్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్ష కేంద్రానికి నిర్దేశిత సమయానికి గంట ముందే రావాలని సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్, బ్లాక్ పెన్సిల్‌తో మాత్రమే రావాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు కీలకం

- అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న అదనపు కలెక్టర్

జనగామ: పట్టణ స్వచ్ఛతలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు కీలమకని, పారుద్ధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ అంశాలపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి సరఫరాకు సంబంధించి ఎలాంటి లోపాలు ఉండొద్దని, సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని చెప్పారు. పట్టణ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వెరిఫికేషన్ వివరాలను త్వరగా ఆన్‌లైన్ చేయాలన్నారు. పట్టణంలో ట్రేడ్ లైసెన్సులు కలిగిన వారే వ్యాపారాలు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన ప్లాట్ల యజమానులకు ప్రొసీడింగ్ కాపీలను అందించాలని ఆదేశించారు. సమీక్ష అనంతరం 154 మంది పారిశుద్ధ్య కార్మికులకు రెండు జతల దుస్తులు, టవల్స్ అందజేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు త్వరగా తరలించాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఏఓ రామారావునాయక్

బచ్చన్నపేట : కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. శుక్రవారం కొడవటూర్ వన నర్సరీ, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డులతోపాటు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో త్వరగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. మిల్లర్ల నుంచి ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులకు తెలియ జేయాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహిచాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య, ఐకేపీ సీసీ సత్యనారాయణ, ఏఈఓ రాజు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీందర్‌గౌడ్



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీందర్‌గౌడ్

బచ్చన్నపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జాతీయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా అధికార విభాగం సిబ్బంది.. మహిళలు, పిల్లల చికిత్సకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, మండల వైద్యాధికారి సృజన, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జవాన్ మురళీనాయక్ త్యాగం మరువలేనిది : ఎమ్మెల్యే 'పల్లా'

జనగామ: జమ్మూ కశ్మీర్‌లో భారత్–పాక్ మధ్య జరుగుతున్న యుద్ధంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందారని, 25 ఏళ్ల వయసులోనే మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన ఆయన త్యాగం మరువలేనిదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జవాను మృతిపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మరో 4 రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు 'స్లాట్ బుకింగ్'

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి వరంగల్ ఆర్ఓ, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, నర్సంపేట రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈనెల 12వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రారంభించేందుకు రిజిస్ట్రేషన్ శాఖ రంగం సిద్ధం చేసింది. కాగా.. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గత నెల 10న వరంగల్ రూరల్, వరంగల్ ఫోర్ట్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో చేపట్టిన స్లాట్ బుకింగ్ పద్ధతి సత్ఫలితాలు ఇవ్వడంతో మరో నాలుగు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ అమలు చేయాలని నిర్ణయించారు. కాగా.. ప్రతీ రోజు ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 48 స్లాట్ బుకింగ్స్, 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది.

నిట్ బీఓజీ చైర్‌పర్సన్‌గా మోహన్‌రెడ్డి

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ బీఓజీ (బోర్డ్ ఆఫ్ గవర్నర్స్) చైర్‌పర్సన్‌గా పద్మశ్రీ డాక్టర్ బీ.వీ.ఆర్ మోహన్‌రెడ్డిని కేంద్ర మంత్రిత్వ శాఖ శుక్రవారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్నెళ్ల కాల పరిమితితో ఆయన చైర్‌పర్సన్‌గా కొనసాగుతారు. కాలపరిమితి అనంతరం నూతన చైర్‌పర్సన్ నియామకం జరిగేంత వరకు మోహన్‌రెడ్డి కొనసాగనున్నారు. నిట్ వరంగల్ విద్యా సంస్థలో విద్యార్థులకు పరిశ్రమల జ్ఞానం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి బీవీఆర్.మోహన్‌రెడ్డిని నియమించడం ఆనందంగా ఉందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండలోని తన నివాసంలో శుక్రవారం మున్సిపాలిటీ అధికారులు, స్థానిక నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని వ్యర్థాల సేకరణ, నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోలు, చెత్తకుండీల ఏర్పాటు, డ్రెయినేజీల శుభ్రత, పారిశుద్ధ్య కార్మికుల నియామకం తదితరాలు వెంటనే చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రస్తుతం ఉన్న ట్యాంకర్లు, అదనంగా అవసరమైతే అంచనాలు సిద్ధం చేయాలని, అంతర్గత పైపులైన్లు వేయాలని చెప్పారు. విద్యుత్ సమస్య లేకుండా చూడాలని, కాలనీల్లో వీధి దీపాలు, ఇంటింటికీ మీటరు, కూడళ్లలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లులో బీటీ రోడ్లు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి గ్రామాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన సాహసకుడి విజయం

- మిజోరంలోని ఫాంగ్‌పుయ్ పర్వతం అధిరోహించిన యశ్వంత్


మిజోరాం ఫాంగ్‌పుయ్ పర్వతంపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేస్తున్న యశ్వంత్

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన గిరిజన యువ మౌంటైనర్ యశ్వంత్ మరో అరుదైన సాహసాన్ని విజయవంతం చేశాడు. ఇటీవల మణిపూర్ రాష్ట్రంలోని ఎత్తైన పర్వతం ఇసో (2,994 మీటర్లు)ను అధిరోహించి రికార్డు సొంతం చేసుకోగా, తాజాగా 2,157 మీటర్ల ఎత్తైన ఫాంగ్ పుయ్ (బ్లూ మౌంటైన్) పర్వతాన్ని యశ్వంత్ అధిరోహించి శుక్రవారం మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటికే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పలు పర్వతాలను మౌంటైనర్ యశ్వంత్ అధిరోహించి గిరిజన పిన్న వయస్సు సాహసకుడిగా ప్రసిద్ధికెక్కాడు. జాతీయ మిషన్ 'హార్ శిఖర్ పర్ తిరంగా' మిషన్ కింద భారత దేశంలోని అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మణిపూర్, రాజస్థాన్, మిజోరాం రాష్ట్రాల్లోని అతి ఎత్తైన పర్వతాలను సులువుగా అధిరోహించాడు. శిఖరాగ్ర సమావేశం నుంచి డ్రగ్స్‌కు నో చెప్పండి, బెట్టింగ్ యాప్‌లకు నో చెప్పండి, జీవితానికి అవునని చెప్పండి అంటూ భారతదేశ యువతకు మౌంటైనర్ యశ్వంత్ స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని ఇస్తూ ఫాంగ్ పుయ్ పర్వతంపై తివర్ణ పతాకాన్ని ఎగురవేశాడు. యశ్వంత్ తన ధైర్యసాహసాలతో ఇప్పటికే 28 రాష్ట్రాల్లో ప్రసిద్ధిచెందిన పర్వతాలు అధిరోహించాడు. అదే విధంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కిలిమంజారో, ఎల్బ్రస్, మౌంట్ కోస్కియుస్కో తదితర పర్వతాలను చుట్టేసి దేశఖ్యాతిని ప్రపంచానికి చాటాడు. చివరికి ప్రపంచంలోని ఏడు శిఖరాగ్ర సమావేశాలను పూర్తి చేయడంతో పాటు భారతదేశ యువతకు ప్రపంచ స్థాయికి ప్రాతి నిధ్యం వహించడమే జీవిత లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు యశ్వంత్ వివరించాడు.

కానిస్టేబుళ్లకు సీపీ అభినందన


కానిస్టేబుల్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న సీపీ

వరంగల్ క్రైం: అత్యధికసార్లు రక్తదానం చేసిన వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్ కన్నె రాజు, కేయూ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవీందర్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు. వరల్డ్ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సుబేదారి రెడ్‌క్రాస్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కన్నె రాజు 37వ సారి, రవీందర్ 18వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేయగా.. వారిని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.

14 కిలోల గంజాయి పట్టివేత



కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్ ఆవరణలో 14.7 కిలోల ఎండు గంజాయిని శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ వేముల చంద్రమోహన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షహనావాస్ కాశీం ఆదేశం మేరకు జిల్లా డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు పర్యవేక్షణలో రైల్వే జంక్షన్‌లో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఒడిశా నుంచి వచ్చే రైళ్లలో గంజాయి రవాణా జరుగుతున్నట్లుగా అందిన ముందస్తు సమాచారం ఆధారంగా రైళ్లలో తనిఖీలు చేపట్టారు. అనంతరం జంక్షన్‌లో ఓ బ్యాగు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆగి తనిఖీ చేయగా.. రూ.90 వేలు విలువైన గంజాయి లభించగా కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి, ఖలీల్, లాలయ్య, కోటిలింగం, ఆయుర్, రషీద్ పాల్గొన్నారు.

పుష్కరాలకు వైద్యసేవలు

కాళేశ్వరంలో 10 వైద్యశిబిరాలు
- ఒక్కో శిబిరంలో 10 పడకలు
- 36 మంది వైద్యులు, 450 మంది సిబ్బంది
- రెండు ప్రత్యేక బృందాల ఏర్పాటు




భూపాలపల్లి అర్బన్: ఈనెల 15నుంచి 26వ తేదీ వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద నిర్వహించనున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా భక్తుల సౌకర్యార్థం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్యశిబిరాలు, మెడికల్ క్యాంపుల్లో వైద్య సేవలు అందించేందుకు సిబ్బందిని నియమించారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి నుంచి స్పెషలిస్టు వైద్యులను కేటాయించారు.

తాత్కాలిక ఆస్పత్రి ఏర్పాటు

కాళేశ్వరం పీహెచ్‌సీలో తాత్కాలికంగా 10 పడకలను ఏర్పాటు చేసి అత్యవసర వైద్యసేవలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆక్సిజన్, పల్స్‌మీటర్, ఈసీజీ సౌకర్యాలు కల్పించనున్నారు. ఇందులో ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు, ఇద్దరు వైద్యాధికారులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, స్టాఫ్ నర్సులను నియమించనున్నారు.

పీహెచ్‌సీలకు ఇబ్బంది కలగకుండా..

కాళేశ్వరంలో ఏర్పాటు చేసే వైద్య శిబిరాల్లో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొననున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 11 రోజులపాటు ఇబ్బందులు కలగకుండా వైద్యాధికారులు, సిబ్బంది కేటాయించారు. ఆర్‌బీఎస్‌కే, పల్లెదవాఖాలు, పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉంటే ఒక్కొక్కరిని, సిబ్బందిని కూడా అదే విధంగా ఎక్కువ మంది ఉన్న సిబ్బందిని కాళేశ్వరం విధులకు పంపించే విధంగా ఏర్పాట్లు చేశారు.

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పర్యవేక్షణ

కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవిని నియమించారు. వైద్య సిబ్బందికి విధులు కేటాయించి వారు అందిస్తున్న సేవలు, ఇబ్బందులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా రెండు మానిటరింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎదురయ్యే ఇబ్బందులను తెలియజేసేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేయనున్నారు.

10 చోట్ల క్యాంపులు

కాళేశ్వరంలో 11 రోజులపాటు మూడు షిఫ్టులో మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నారు. ముక్తీశ్వర ఆలయ సమీపం, పాత ఈఓ కార్యాలయం, టెంట్ సిటీ, పార్కింగ్ -1, పార్కింగ్-2, పార్కింగ్ -3, హరిత హోటల్, గోదావరి మెయిన్ ఘాట్, వీఐపీ ఘాట్, హెలిపాడ్ దగ్గరలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలో 10 పడకలతో తాత్కాలిక వైద్యశాల ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో డాక్టర్(ఎంఎల్‌హెచ్‌పీ), హెల్త్ సూపర్‌వైజర్, ఇద్దరు చొప్పున ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లను నియమించారు. వ్యాధి తీవ్రతను బట్టి అత్యవసరమైతే మహదేవపూర్‌లోని సీహెచ్‌సీకి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా సేవలు




కాళేశ్వరం పుష్కర స్నానానికి వచ్చే భక్తులకు ఆరోగ్య పరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశాం. వేసవికాలం కావడంలో ఇక్కడికి వచ్చే భక్తులు జాగ్రత్తలు పాటించాలి. దగ్గు, జలుబు, ఇబ్బందులు ఎదురైనట్లయితే వెంటనే వైద్యశిబిరాలను సంప్రదించాలి. ఎక్కువసేపు ఎండలో తిరగొద్దు. మధ్యాహ్న సమయంలో స్నానం చేయకపోవడమే మంచిది. రోజూ ఒక్కో క్యాంపులో 2వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తాం.

– మధుసూదన్, డీఎంహెచ్‌ఓ

'కాళేశ్వరం' అప్పుడు.. ఇప్పుడు


ప్రస్తుతం కాళేశ్వరాలయం


1975కు ముందు శిథిలావస్థలో ఉన్న కాళేశ్వరం దేవస్థానం



కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం 1975కు పూర్వం శిథిలావస్థలో ఉండేది. అప్పటి వరకు కీకర దండకారణ్యం కావడంతో కాకులు దూరని కారడవిగా ఉండే ఆలయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. అప్పటి రవాణాశాఖ మంత్రి జువ్వాడి చొక్కారావు ప్రత్యేక చొరవ తీసుకొని జీర్ణోద్ధరణ కమిటీ వేసి పనులు ప్రారంభించారు. కమిటీలో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, అప్పటి కలెక్టర్ ఇతరులు సభ్యులుగా ఉన్నారు. రోడ్డు, రవాణా, విద్యుత్, కనీస అవసర సదుపాయాలు కల్పించారు. 1982లో శృంగేరి శారద పీఠాధిపతులు విద్యాతీర్థమహాస్వామి, భారతీతీర్థస్వామి చేతుల మీదుగా కుంభాభిషేకం చేసి జీర్ణోద్ధరణ జరిపారు. తర్వాత దేవస్థానం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ అనేక మార్పులు సంతరించుకున్నాయి. నాడు పదుల సంఖ్యలో వచ్చే భక్తులు.. ప్రస్తుతం వేల సంఖ్యలో తరలివస్తున్నారు. ప్రస్తుతం దేవాలయం వార్షికాదాయం రూ.6 కోట్లకు చేరింది. రోడ్డు, రవాణా, అంతర్రాష్ట్ర వంతెనలు, కమ్యూనికేషన్ వ్యవస్థ పెరిగింది. దేవస్థానం దేశవ్యాప్తంగా కీర్తి పొందుతూ ప్రాచుర్యంలోకి వచ్చింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత 2016లో అప్పటి సీఎం కేసీఆర్ రూ.25 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం సరస్వతీనది పుష్కరాల నేపథ్యంలో రూ.25కోట్ల వరకు నిధులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టితో నిధులు మంజూరు చేయగా పనులు జరుగుతున్నాయి. ఈనెల 15 నుంచి 26 వరకు సరస్వతీనది పుష్కరాలను ప్రభుత్వం నిర్వహించనుంది. పుష్కరాల ప్రారంభానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. త్రివేణి సంఘమైన(గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిణిగా సరస్వతీనది) కాళేశ్వరంలో 12ఏళ్లకోసారి ఒక్కో నదికి పుష్కరాలు నిర్వహిస్తుంటారు.

గోడలకు దేవతామూర్తుల చిత్రాలు


గోడకు దేవతామూర్తి చిత్రం వేస్తున్న ఆర్టిస్ట్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాల సందర్భంగా ఖాళీగా ఉన్న గోడలు, భవనాలకు దేవతామూర్తుల చిత్రాలను వేస్తున్నారు. గురువారం నుంచి ఆలయ పరిసరాల్లో చిత్రాలు వేసే పనులు ప్రారంభమయ్యాయి.

వీవీఐపీ హెలిపాడ్ సిద్ధం


హెలిపాడ్ వద్ద తనిఖీలు చేస్తున్న సిబ్బంది

కాళేశ్వరం: కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాల సందర్భంగా సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు హెలికాప్టర్‌లో రానున్న నేపథ్యంలో వీవీఐపీ హెలిపాడ్ సిద్ధం చేస్తున్నారు. హెలిపాడ్ వద్ద బాంబ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీలు గురువారం చేపట్టారు. కన్నెపల్లిలో మూడు హెలిపాడ్‌లు ఉన్న విషయం తెలిసిందే. మొత్తం నాలుగు హెలిపాడ్‌లు సిద్ధంగా ఉన్నాయి.

సరస్వతీ ఘాట్ వద్ద 50 ఎకరాల్లో పార్కింగ్


వీఐపీ ఘాట్ వద్ద వాహనాల పార్కింగ్ కోసం చదును చేసిన స్థలం

కాళేశ్వరం: కాళేశ్వరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, వీఐపీల కోసం సుమారు 50 ఎకరాల్లో పార్కింగ్ సిద్ధం చేస్తున్నారు. ఏడు డోజర్లతో చదును చేస్తున్నారు. ప్రైవేట్ వాహనాలు ఘాట్ వరకు వచ్చే విధంగా పార్కింగ్ పనులను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

పుష్కరాల్లో కళాకారుల ప్రదర్శనలు

కాళేశ్వరం: కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాల్లో ప్రత్యేక కళాకారులు, వివిధ రంగాల కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. మొత్తం 235 మంది కళాకారులు ప్రతిరోజూ సంగీతం, కూచిపూడి, భరతనాట్యం, జానపద గీతాలు, కథక్, బుర్రకథ, పేరిణి, కడ్డి తంత్రి, భక్తిగీతాలు, చిందు, ఒగ్గు, మోహిని అట్టం, ఆంధ్ర నాట్యం, భక్తి సంగీతం, సురభి నాటకం ప్రదర్శించనున్నారు.

సరస్వతీమాత విగ్రహానికి వస్త్రం తొడుగు


సరస్వతీమాత విగ్రహానికి తొడిగిన వస్త్రం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరగనున్న సరస్వతినది పుష్కరాల సందర్భంగా సరస్వతిమాత విగ్రహాన్ని బుధవారం స్థిరప్రతిష్ఠ చేశారు. కాగా, ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్న నేపథ్యంలో శిల్పులు, స్థపతి ఆధ్వర్యంలో సరస్వతిమాత విగ్రహానికి, నలుగురు వేద మూర్తుల విగ్రహాలకు గురువారం వస్త్రం తొడిగి కనిపించకుండా కప్పేశారు.

కళాశాలలో ప్రవేశానికి కౌన్సెలింగ్

న్యూశాయంపేట: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రీజినల్ కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్ డీఎస్.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ(జి), పాలకుర్తి(జి), పర్వతగిరి(జి), మూడుచెక్కలపల్లి(జి), నర్సంపేట(బాలుర) కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో సీట్లు స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తికలిగి పదో తరగతి పాసైన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు ఈనెల 15న వరంగల్ నగరంలోని యాకూబ్‌పురలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 94909 57296 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చిన్నారులతో మండుటెండల్లో పనులు


ఎండలో పనిచేస్తున్న చిన్నారులు

కొత్తగూడ: చిన్న పిల్లలు అనే దయ లేదు.. కూలీ డబ్బులు మిగులుతాయని కక్కుర్తిపడి ఓ తునికాకు కాంట్రాక్టర్.. చిన్నారులకు రూ.20 ఇస్తానని ఆశ చూపి మండుటెండలో కల్లంలో పనులు చేయించడం మండలంలో చర్చనీయాశంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పూనుగొండ్ల యూనిట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మండలంలోని దుర్గారం గ్రామంలో తునికాకు సేకరిస్తున్నాడు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి కట్టలు తడిశాయి. వాటిని దులుపుకుంటూ తిప్పి పెట్టాల్సి ఉంటుంది. అందుకు పెద్దవారిని పనికి పిలిస్తే ఒకరికి కూలీ రూ.400 ఇవ్వాల్సి వస్తుంది. అది మిగిల్చుకోవాలనే కక్కుర్తితో స్థానికంగా కనిపించిన చిన్నారులకు రూ.20 ఇస్తానని చెప్పి మండుటెండలో పనులు చేయించాడు. చిన్నారులు పనులు చేస్తుంటే సదరు కాంట్రాక్టర్ కింద పనిచేసే గుమస్తా.. చెట్టు నీడన ఉండి త్వరగా పని చేయండి అంటూ.. హుకుం జారీ చేయడంతో చిన్నారులు మండుటెండలో కట్టలను మార్చారు. ఈవిషయం కాస్త సోషల్ మీడియాలో రావడంతో ఆదివాసీ సంఘాలు, మానవ హక్కుల సంఘాలు మండి పడుతున్నాయి. ఎండ తీవ్రతకు చిన్నారులకు ఏదైనా జరగరానికి జరిగితే ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడం తగదు


కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు, వివిధ జర్నలిస్టు, ప్రజా సంఘాల నాయకులు

- జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన

హన్మకొండ అర్బన్: సాక్షి తెలుగు దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డి ఇంట్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు అక్రమంగా చొరబడి సోదాలు చేయడాన్ని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. పత్రికా స్వేచ్ఛను కాలరాసే విధంగా ఏపీ పోలీసులు వ్యవహరించారని మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వ తీరుపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సాక్షి పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఏపీ పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించి కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పత్రికా స్వేచ్ఛను హరించేలా ఏపీ పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హితవు పలికారు. నిరసన కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జ్ వర్ధెల్లి లింగయ్య, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, రాష్ట్ర నాయకులు వల్లాల వెంకటరమణ, గాడిపెల్లి మధు, వేణుమాధవ్, యూనియన్ ప్రతినిధి తోట సుధాకర్, టీయూడబ్ల్యూజే –143 హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, అర్షం రాజ్‌కుమార్, కోరుకొప్పుల నరేందర్, వాంకే శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు పిన్నా శివకుమార్, అబ్బు వెంకట్‌రెడ్డి, అల్లం రాజేష్ వర్మ, సదానందం, ఎలక్ట్రానిక్ మీడియా, ఫొటో జర్నలిస్టు సంఘాల నుంచి తిరుపతి, గొట్టె వెంకట్, సంపెట వెంకటేశ్వర్లు, వరప్రసాద్, ఐజేయూ – టీయూడబ్ల్యూజే జిల్లా నాయకుడు ఊటుకూరు సాయిరాం, సీనియర్ జర్నలిస్టులు అల్వాల సదాశివుడు, కోలా కృష్ణకుమార్ రెడ్డి, అహ్మద్, బత్తిని రాజేందర్, రమేష్, నరేందర్, వెంకటస్వామి, సుధాకర్, నాగరాజు, రమేష్, అనిల్, రాజిరెడ్డి, శ్రీనివాస్, డెస్క్ జర్నలిస్టులు మహేష్, ఓంకార్, రవికుమార్, అశోక్, రాజు, రమేష్, దాసరి బాబు, రాంచందర్ రావు, రామాచారి, శ్రావణ్, శ్రీనివాస్, మధుసూదన్, పాత్రికేయులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరి దుర్మరణం


భూక్య సంతోష్ (ఫైల్)


గుగులోతు కార్తీక్ (ఫైల్)

మరిపెడ: రెండు బైక్‌లు ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రం శివారులో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మరిపెడ మండలం బాబోజీగూడెం గ్రామ శివారు వెంకురాం తండాకు చెందిన భూక్య సంతోష్ (30), భోజ్యతండాకు చెందిన గుగులోతు కార్తీక్ (35) స్నేహితులిద్దరు కలిసి గురువారం రాత్రి తండా నుంచి మరిపెడ మండల కేంద్రానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. బాబోజీగూడెం శివారు వాగొడ్డు తండాకు చెందిన అజ్మీర సుధీర్ మరో ద్విచక్రవాహనంపై వారు వెళ్తున్న దారిలో వెళ్తున్నాడు. మరిపెడ మున్సిపాలిటీ సమీపంలోని 365జాతీయ రహదారిపై అతివేగం కారణంగా ఆ రెండు బైక్‌లు పరస్పరం ఢీ కొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. సుధీర్‌కు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అజ్మీరా లాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి
- వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న రాంకుమార్ రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని, బాల్యం నుంచే ఏదో ఒక క్రీడను ఎంచుకుని అందులో రాణించాలని కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో నెలరోజుల పాటు నిర్వహించనున్న ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని కేఎంసీ మైదానంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను వృథా చేయకుండా ప్రత్యేక శిక్షణ శిబిరాల ద్వారా సరికొత్త మెళకువలు నేర్చుకోవాలని క్రీడాకారులకు చెప్పారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ గత దశాబ్దకాలంగా కేఎంసీ మైదానం.. ఎంతో మంది జాతీయస్థాయి క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో డబ్ల్యూసీఏ ఉపాధ్యక్షులు సదాశివ, రాము, కార్యవర్గ సభ్యుడు అభినవ్ వినయ్, కోచ్ గోవింద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపం.. కుక్క పిల్లకు జ్యూస్


కుక్క పిల్లకు శీతల పానీయం తాగిస్తున్న మహిళ

వెంకటాపురం(కె): ఎండలు మండుతుండడంతో ప్రజలు ఎండ వేడిని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేడి నుంచి ఉపశమనం కోసం శీతల పానీయాలు, జ్యూస్‌ల వైపు మొగ్గు చూపుతన్నారు. ఈక్రమంలో అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఓ మహిళ.. తన పెంపుడు కుక్కపిల్ల ఎండ వేడిమి తట్టుకోలేక అవస్థ పడుతుండటంతో దానికి శుక్రవారం శీతల పానీయం తాగించడం గమనార్హం.



సుందరీమణుల రాకకు సుందరంగా..

ఖిలా వరంగల్: ప్రపంచ సుందరీమణుల రాకకు కోట సుందరంగా ముస్తాబవుతోంది. శుక్రవారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో శిల్పకళా సంపద మరింత అందంగా, ఆకర్షణీయంగా కనువిందు చేస్తోంది. ఈ సందర్భంగా కాకతీయుల రాజధాని మధ్యకోటలో జరుగుతున్న పనులను కుడా, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే శుక్రవారం పరిశీలించారు. శిల్పాల ప్రాంగణం, కోట రోడ్డుకు ఇరువైపులా మరింత సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. విద్యుత్‌కు అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ తగిన ఏర్పాట్లు చేసింది. విద్యుత్ దీపాల వెలుగుల్లో శిల్పకళా వైభవాన్ని సుందరీమణుల వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా రాత్రి శిల్పాల ప్రాంగణంలో ట్రయల్ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు అజిత్‌రావు, భీమ్‌రావు, బల్దియా అధికారులు, కేంద్ర పురావస్తు శాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్, సౌండ్ అండ్ లైటింగ్ షో ఇన్‌చార్జ్ అజయ్, గైడ్ దేనబోయిన రవియాదవ్, డీఈ మల్లికార్జున్, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ కాంతుల్లో వెలుగులీనుతున్న కోటలోని శిల్పాల ప్రాంగణం